

రూ.6.7 లక్షల ఆదాయం

బేతంచెర్ల: శ్రీలక్ష్మి గణమద్దిలేటి నరసింహస్వామికి శనివారం ఒక్క రోజు వివిధ సేవల ద్వారా రూ.6,77,315 ఆదాయం వచ్చినట్లు ఈఓ రామాంజనేయులు తెలిపారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం: అన్నప్రసాద పథకానికి హైదరాబాద్‌కు చెందిన కె.నాగవెంకటేశ్వరరావు రూ.1,01,116, బెంగళూరుకు చెందిన పీవీ రవీంద్ర రూ.1,00,001 విరాళంగా అందజేశారు.



సృజనాత్మకతకు వేదికలు

వేసవి సెలవుల్లో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. శిబిరాల్లో విజ్ఞానంతోపాటు వినోదాన్ని అందిస్తున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

జైళ్లను తనిఖీ చేసిన జిల్లా జడ్జి



మాట్లాడుతున్న జడ్జి ఎస్. శ్రీనివాసరావు

కర్నూలు (లీగల్): జాతీయ, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు పంచలింగాల గ్రామంలోని జిల్లా జైలు, మహిళా జైలును తనిఖీ చేశారు. అక్కడ ఉన్న ఖైదీల వివరాలను సంబంధిత జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారికి అందించే భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించి, పర్యవేక్షణ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్‌కు సంబంధించిన చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, జైలు పర్యవేక్షణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ. 72.9లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయానికి భక్తులు సమర్పించిన కానుకలకు సంబంధించిన హుండీని శనివారం కాలక్షేపపు మండపంలో లెక్కించారు. నగదు రూపంలో రూ.72,92,228, అలాగే బంగారం 66.700 గ్రాములు, వెండి 13.6 కేజీలు వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.జి.వెంకటేష్ తెలిపారు.

సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



పత్తికొండలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో 10వ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జే రంగలక్ష్మిదేవి తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయా సబ్జెక్టుల వారీగా పలు వసతి గృహాల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు సహాయ సంక్షేమాధికారుల పరిధుల్లోని 28 వసతి గృహాల్లో మొత్తం 661 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాశారన్నారు. ఇందులో 397 మంది ఉత్తీర్ణులు కాగా 264 మంది ఫెయిల్ అయ్యారన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు అందరూ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేందుకు బాలికలకు ఆదోని, కర్నూలు, కోడుమూరు, పత్తికొండ ప్రాంతాల్లోను, బాలురకు ఆలూరు, గార్గేయపురం, వెల్దుర్తి, పత్తికొండ ప్రాంతాల్లోని వసతి గృహాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

చేనేత మెరుపులు

ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలకు మంచిరోజులు

- ఒక జిల్లా–ఒక ఉత్పత్తి కింద జాతీయ పురస్కారానికి ప్రతిపాదన
- జాతీయస్థాయి అవార్డుతో భౌగోళిక గుర్తింపునకు అవకాశం
- స్వాతంత్య్ర పోరాట సమయంలోనే ఊపిరి పోసుకున్న చేనేత
- ఏటా రూ.6.50 కోట్ల టర్నోవర్‌తో చేనేత వస్త్రాల రికార్డు
- చేనేత అభివృద్ధికి నాడు వైఎస్‌ఆర్... నేడు వైఎస్ జగన్ చేయూత



కర్నూలు(అగ్రికల్చర్): ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. అయితే భౌగోళిక గుర్తింపు లేకపోవడంతో జిల్లా యంత్రాంగంతో పాటు ప్రభుత్వం ఆ దిశగా కసరత్తు చేస్తున్నాయి. ఒక జిల్లా–ఒక ఉత్పత్తి కింద ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలకు జాతీయ స్థాయి అవార్డు కోసం చేనేత, జౌళిశాఖ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. 2023–24 నుంచి అపురూపమైన చేతివృత్తులకు కేంద్రం జాతీయ స్థాయి అవార్డులు ప్రకటించి వాటిని ప్రోత్సహిస్తోంది. 2023–24లో కోడుమూరు పట్టుచీరలకు జాతీయ స్థాయి పురస్కారం లభించింది. ఈ నేపథ్యంలో ఇక్కడి చీరలకు జాతీయ స్థాయిలో డిమాండ్ ఏర్పడింది. 2024–25 సంవత్సరానికి ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలైన బెడ్‌షీట్స్, టువాళ్లు, లుంగీలు, చేతిరుమాళ్లు, దోమతెరలు, షర్టింగ్ క్లాత్‌లు, దోవతులు, కాటన్, పట్టు చీరలకు ఒక జిల్లా–ఒక ఉత్పత్తి కింద జాతీయ స్థాయి అవార్డు కోసం జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. జాతీయ స్థాయి అవార్డు లభించడం ద్వారా భౌగోళిక గుర్తింపు లభించే అవకాశం ఉంది. స్వాతంత్య్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఎమ్మిగనూరు చేనేతకు కొన్ని దశాబ్దాల తర్వాత భౌగోళిక గుర్తింపు వచ్చేందుకు మార్గం సుగమమైంది.

స్వాతంత్య్రానికి ముందే ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం ఏర్పాటు

స్వాతంత్య్ర పోరాట స్ఫూర్తితోనే 1938లో ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం ఏర్పాటైంది. పద్మశ్రీ అవార్డు గ్రహీత మాచాని సోమప్ప కరువు కాలంలో ఈ సంఘాన్ని ప్రారంభించారు. ఇక్కడ ఉత్పత్తి చేసిన చేనేత వస్త్రాలను ధరించే స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘాన్ని మురార్జీదేశాయ్ స్వయంగా వచ్చి పరిశీలించారు. ఇక్కడి వీవర్స్ కాలనీకి ఆయనే శంకుస్థాపన చేశారు. మాచాని సోమప్ప నాటి జవహర్‌లాల్ నెహ్రూతో గుంతకల్లులో సమావేశమై చేనేత వస్త్రాల ఉత్పత్తి, విశిష్టతను వివరించారు. ఈ సొసైటీకి ఇంటర్నేషనల్ అవార్డుతో పాటు పలు నగదు పురస్కారాలు లభించాయి.

జాతీయ స్థాయిలో గుర్తింపు

నాణ్యత, హుందాతనానికి మారుపేరైన ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. అయితే భౌగోళిక గుర్తింపు లభించలేదు. జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్నప్పటికీ భౌగోళిక గుర్తింపు లేకపోవడం వల్ల వివిధ ప్రాంతాల్లో ఉత్పత్తి అయిన చేనేత వస్త్రాలతో పోటీపడలేని పరిస్థితి ఏర్పడింది. ఎమ్మిగనూరు వస్త్రాలకు చారిత్రాత్మక నేపథ్యం ఉండటంతో కొన్ని దశాబ్దాల తర్వాత భౌగోళిక గుర్తింపు తెచ్చేందుకు ఇటు జిల్లా యంత్రాంగం, అటు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నాయి. ఇందులో భాగంగానే ఒక జిల్లా– ఒక ఉత్పత్తి కింద జాతీయ స్థాయి పురస్కారానికి అపురూపమైన ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలను ఎంపిక చేయడం విశేషం. ఎమ్మిగనూరు చేనేత వస్త్రాల మార్కెటింగ్‌కు కర్ణాటక, తెలంగాణ, ఏపీ తదితర ప్రాంతాల్లో 17 రీటైల్ అవుట్‌లెట్స్ ఉన్నాయి. చేనేత వస్త్రాలు విదేశాలకు సైతం ఎగుమతి అవుతున్నాయి.

చేనేతకు మళ్లీ మంచి రోజులు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ఇప్పటికే చేనేతకు మంచి రోజులు వచ్చాయి.
- భౌగోళిక గుర్తింపు లభిస్తే ఎమ్మిగనూరు చేనేతకు జాతీయ స్థాయిలో తిరుగు ఉండదు.
- చేనేత పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం కింద ఆదుకుంటోంది.
- చేనేత పరిశ్రమ ఆధునికీకరణ, పవర్ లూమ్ పోటీని తట్టుకునేందుకు ప్రభుత్వం నెలకు రూ.2వేల ప్రకారం ఏడాదికి రూ.24వేల ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది.
- చేనేత పరిశ్రమ అభివృద్ధికి క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఇతోధికంగా తోడ్పడుతోంది.
- ఎమ్మిగనూరు క్లస్టర్ డెవలప్‌మెంట్ కింద 250 మంది చేనేతకారులకు అధునాతన పరికరాలు, పనిముట్లు అందించడం విశేషం.
- రూ.44.58 లక్షలతో ఆధునిక చేనేత మగ్గాలు పంపిణీ చేశారు.
- అధునాత వస్త్రాల తయారీకి ప్రత్యేకంగా డిజైనర్‌ను కూడా నియమించారు.

చేనేత అభివృద్ధికి నాడు వైఎస్‌ఆర్.. నేడు వైఎస్ జగన్

పవర్‌లూమ్స్ వచ్చిన తర్వాత చేనేత పరిశ్రమ క్రమంగా మనుగడ కోల్పోయే పరిస్థితికి వచ్చింది. ఉనికిని కోల్పోతున్న చేనేత పరిశ్రమకు నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఊపిరిపోశారు. అప్పుల బాధతో ఆత్మహత్యలకు పాల్పడిన చేనేత కుటుంబాలకు పరిహారం చెల్లించే ప్రక్రియకు దివంగత వైఎస్‌ఆర్ శ్రీకారం చుట్టారు. రుణమాఫీ చేయడం ద్వారా కూడా వైఎస్‌ఆర్ అండగా నిలిచారు. వైఎస్‌ఆర్ హయాంలో జిల్లాలో చేనేతకారుల బ్యాంకు రుణాలు దాదాపు రూ.12కోట్ల వరకు మాఫీ అయ్యాయి. 50 ఏళ్లు నిండిన చేనేతకారులకు పింఛను సదుపాయం కల్పించిన ఘనత కూడా వైఎస్‌ఆర్‌దే.



ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో చేనేతకు పుట్టినిల్లు ఎమ్మిగనూరు. ఒకవైపు ఎమ్మిగనూరు వీవర్ కో–ఆపరేటివ్ ప్రొడక్షన్ సేల్ సొసైటీ లిమిటెడ్, మరోవైపు మాస్టర్ వీవర్స్ ద్వారా ఎమ్మిగనూరుతో పాటు ఆదోని, గుడేకల్, నందవరం తదితర ప్రాంతాలకు విస్తరించింది. నేడు చేనేత పరిశ్రమపై 2వేల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. ఎమ్మిగనూరు చేనేత

ఏటా రూ.6.50 కోట్ల టర్నోవర్

సహకార సంఘం ద్వారా 250 కుటుంబాలు, మాస్టర్ వీవర్స్ ద్వారా 1,500 కుటుంబాలు రాణిస్తున్నాయి. ఏటా ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం రూ.1.50 కోట్ల టర్నోవర్ సాధిస్తుండగా మాస్టర్ వీవర్ల ద్వారా ఏటా రూ.5 కోట్ల వరకు టర్నోవర్ ఉండటం విశేషం. ఎమ్మిగనూరు యూనిట్‌గా ఏటా రూ.6.50 కోట్ల టర్నోవర్ ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘంతో సంబంధం లేకుండా 22 మంది మాస్టర్ వీవర్లు చేనేత పరిశ్రమ విస్తరణకు తోడ్పడుతున్నారు. ఇక్కడ ఖద్దరు వస్త్రాలు కూడా ఉత్పత్తి అవుతున్నాయి.

భౌగోళిక గుర్తింపు వచ్చే అవకాశం



ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలకు చారిత్రాత్మక నేపథ్యం ఉంది. స్వాతంత్య్రోద్యమ సమయంలోనే ఎమ్మిగనూరులో చేనేత వస్త్రాల తయారీకి పునాది పడింది. ఇక్కడి వస్త్రాలకు ప్రత్యేకత ఉండటంతో ఒక జిల్లా–ఒక ఉత్పత్తి కింద జాతీయ స్థాయి అవార్డుకు జిల్లా యంత్రాంగం ద్వారా ప్రతిపాదనలు పంపించాం. జాతీయ స్థాయి అవార్డు లభిస్తే ఎమ్మిగనూరు వస్త్రాలకు భౌగోళిక గుర్తింపు లభించే అవకాశం ఉంది.

– హరికృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్, కర్నూలు

కౌంటింగ్‌లో పొరపాట్లకు తావివ్వొద్దు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): జూన్ 4వ తేదీన నిర్వహించే కౌంటింగ్‌లో పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఆర్వోలు, ఏఈ ఆర్వోలు, జిల్లా అధికారులతో శనివారం ఆమె సమీక్ష నిర్వహించారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించిన ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో కౌంటింగ్‌ను కూడా విజయవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి సంబంధించి పార్లమెంట్, అసెంబ్లీకి వేర్వేరుగా కౌంటింగ్ హాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కౌంటింగ్ హాలులో 14 టేబుళ్లు, రిటర్నింగ్ అధికారి టేబుల్ ఉంటుందన్నారు. 14 టేబుళ్లలో ఒకదానిపై మెస్ ఎన్‌క్లోజర్‌తో కూడిన వీవీ ప్యాట్ కౌంటింగ్ చేయాలన్నారు. వీవీ ప్లాట్ల కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసే బూత్‌లను రేపటి నుంచి ఏర్పాటు చేసుకోవాలని ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, టిడ్కో ఎస్‌ఈలను ఆదేశించారు. కౌంటింగ్ హాళ్లలో ఏర్పాటు చేసే టేబుళ్లు, చైర్లను వారంలోపు అమర్చాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్ల ఫోన్లను లోపలికి అనుమతించబోమన్నారు. ట్రెజరీ స్ట్రాంగ్ రూములలో భద్రపరచిన పోస్టల్ బ్యాలెట్లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కౌంటింగ్‌కు 24 గంటల ముందు క్లోజ్డ్ వెహికల్‌లో ఆర్‌యూకు తెచ్చేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. కౌంటింగ్ కోసం ఆర్వోకు సహాయంగా పనిచేసేందుకు జిల్లా అధికారులను నియమించామన్నారు. సమావేశంలో పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య, ఆర్వోలు భార్గవ్‌తేజ, శివ్‌నారాయణ్ శర్మ, ఎం.శేషిరెడ్డి, రామలక్ష్మి, చిరంజీవి, మురళి, రామనాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత

రాయలసీమ యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రతను ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. శనివారం ఆమె జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్‌తో కలసి స్ట్రాంగ్‌రూమ్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఉండే భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షణ చేయాలన్నారు. సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలన్నారు.

రబీలో 70,982 హెక్టార్లలో పంట నష్టం

కర్నూలు(అగ్రికల్చర్): రబీలో 70,982.46 హెక్టార్లలో 33 శాతం ఆపైన పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాలో మొత్తం 58,901 మంది రైతులు పంటలను నష్టపోయారు. వీరికి రూ.71,57,64,304 ఇన్‌పుట్ సబ్సిడీ(పెట్టుబడి రాయితీ) విడుదల చేసేందుకు ఈ నెల 25న ప్రభుత్వానికి జాబితాను జిల్లా యంత్రాంగం పంపనుంది. గత ఏడాది వర్షాభావ పరిస్థితులు రబీని కూడా వెంటాడాయి. ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద, సి.బెళగల్, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, మద్దికెర, గూడూరు, కల్లూరు, ఓర్వకల్లు, కోడుమూరు, ఆదోని, మంత్రాలయం, పత్తికొండ, తుగ్గలి, వెల్దుర్తి మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం గుర్తించింది. గతంలోనే కరువు మండలాల్లో నష్టపోయిన రైతుల జాబితాలను ప్రభుత్వానికి పంపారు. తాజాగా నష్టపోయిన రైతుల జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో సోషల్ ఆడిట్‌కు పెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాత ఈ నెల 25న ప్రభుత్వానికి తుది జాబితాలను పంపనున్నారు.

గురుకులాల్లో మిగిలిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

కర్నూలు(అర్బన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో జూనియర్ ఇంటర్‌లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 22, 23వ తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ డా.ఐ శ్రీదేవి తెలిపారు. అభ్యర్థులు ప్రవేశ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా 1:3 నిష్పత్తిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం కౌన్సిలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. బాలురకు ఈ నెల 22న చిన్నటేకూరు గురుకుల కళాశాలలో, బాలికలకు 23న దిన్నెదేవరపాడు గురుకుల కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. బాలురకు మొత్తం 248 సీట్లు ఉండగా, వీటిలో ఎస్‌సీ 172, బీసీ 13, ఎస్‌టీ 20, ఓసీ 06, బీసీ–సీకి 37 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. మెరిట్ ప్రకారం ఎస్‌సీ 76.5 మార్కుల నుంచి 17.75 మార్కుల వరకు, ఎస్‌టీ 77.5 నుంచి 17.5 వరకు, బీసీ 83.75 నుంచి 57.5 వరకు, ఓసీ 82.5 నుంచి 53.75 వరకు, బీసీ–సీ 42.5 నుంచి 22.5 వరకు మార్కులు వచ్చిన వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలికలకు మొత్తం 332 సీట్లు ఉన్నాయని, ఇందులో ఎస్‌సీలకు 200, బీసీ 35, ఎస్‌టీ 32, ఓసీ 10, బీసీ –సీ లకు 55 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. మెరిట్ ప్రకారం ఎస్‌సీ బాలికలకు 70.25 నుంచి 15.25 మార్కుల వరకు, ఎస్‌టీ 56.25 నుంచి 13 వరకు, బీసీ 84.75 నుంచి 45 వరకు, ఓసీ 79 నుంచి 41.25 మార్కుల వరకు వచ్చిన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్లయిడింగ్ కోరే విద్యార్థులు కూడా కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 08518-295601, 9010070219 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆర్‌యూ కాన్వకేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం 4వ స్నాతకోత్సవానికి (కాన్వకేషన్) దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ ఆదేశాల మేరకు జూన్‌లో కాన్వకేషన్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. 2022–23 విద్యా సంవత్సరం ముగిసే నాటికి అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు http://convocation.rukpayment.com వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

విస్తారంగా వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. నంద్యాల జిల్లా వ్యాప్తంగా తేలికపాటి నుంచి అతి భారీ వర్షాలు, కర్నూలు జిల్లా కల్లూరులో భారీ వర్షం పడగా.. వివిధ ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. కర్నూలు జిల్లాలో మే నెల సాధారణ వర్షపాతం 40.1 మి.మీ ఉండగా.. ఇప్పటి వరకు 76.4 మి.మీ వర్షపాతం నమోదైంది. 91 శాతం అధిక వర్షపాతం నమోదు కావడం విశేషం. నంద్యాల జిల్లాలో ఒక్క చాగలమర్రి మినహా మిగిలిన అన్ని మండలాల్లో వర్షాలు కురిశాయి. ఒకే రోజు సగటున 28.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఉయ్యాలవాడలో కుండపోత వర్షం కురిసింది. ఇక్కడ 117.4 మి.మీ వర్షపాతం నమోదైంది. నంద్యాల జిల్లా మే నెల సాధారణ వర్షపాతం 36.9 మి.మీ ఉండగా.. ఇప్పటి వరకు 87.2 మి.మీ వర్షపాతం నమోదైంది. 136 శాతం అధిక వర్షపాతం నమోదు కావడం విశేషం. నిన్న మొన్నటి వరకు నీళ్లు లేక వెలవెలపోయిన చెరువులు, కుంటలు, వాగులు, వంకలు నేడు నీటితో కళకళలాడుతున్నాయి. తాజా వర్షాల వల్ల భూగర్భ జలాలు పెరుగుతుండటంతో నీటి సమస్యకు పరిష్కారం లభిస్తోంది. ముందస్తు వర్షాలతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వేరుశనగ, పత్తి, కంది పంటలు వేసుకోవడానికి రైతులు సిద్ధమవుతున్నారు.

మండలం	వర్షపాతం(మి.మీ)
పాణ్యం	71
గడివేముల	60.6
బేతంచెర్ల	60.2
కల్లూరు	52.4
ఆళ్లగడ్డ	49
సంజామల	48.6
ఆత్మకూరు	43.2

రాకపోకలకు హాయివేలు

- 69.63 కిలోమీటర్ల మేర జరుగుతున్న పనులు
- త్వరలో మంత్రాలయం బైపాస్ పనులకు టెండర్లు
- రూ.3.22 కోట్లతో పూర్తి అయిన ఓఆర్, ఎఫ్‌డీఆర్ పనులు

కర్నూలు(అర్బన్): జిల్లాలో మూడు జాతీయ రహదారుల నిర్మాణ పనులు 69.63 కిలోమీటర్ల మేర శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ఈ మూడు రహదారుల నిర్మాణాలకు రూ.207.50 కోట్లు వెచ్చించి భూములను సేకరించారు. ఈ రహదారి నిర్మాణాలతో పాటు పలు జాతీయ రహదారులకు అనుబంధంగా ఉన్న రోడ్లలో ఆర్డినరీ రిపేర్స్ (ఓఆర్), ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్స్ (ఎఫ్‌డీఆర్) కూడా చేపట్టారు.

– కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టు నుంచి గార్గేయపురం వరకు (ఎన్‌హెచ్ 340 సీ) రూ.96 కోట్లతో 9 కిలోమీటర్ల మేర గత ఏడాది మార్చి నెలలో పనులు ప్రారంభమయ్యాయి. వీటికి సంబంధించి రూ.14.50 కోట్ల వ్యయంతో భూసేకరణ చేశారు.



మూడు కిలోమీటర్ల మేర పూర్తి అయిన గార్గేయపురం జాతీయ రహదారి

గార్గేయపురంలో భూసేకరణ పూర్తి కాగా, రుద్రవరం, పసుపుల గ్రామాల్లో భూసేకరణ అనుమతుల్లో కొంత జాప్యం చోటు చేసుకుంది. ఇప్పటి వరకు 3 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఈ పనులను పూర్తి చేయాల్సి ఉంది.

- సోమయాజులపల్లె నుంచి డోన్ వరకు (ఎన్‌హెచ్ 340 బీ) రూ.629 కోట్ల వ్యయంతో 53.33 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిగా విస్తరిస్తున్నారు. గత ఏడాది నవంబర్ నెలలో ఈ పనులు ప్రారంభించగా, ఇప్పటి వరకు 25 కిలోమీటర్ల మేర పూర్తి కాగా, మిగిలిన పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులను 2025 నవంబర్ 20వ తేదీ నాటికి పూర్తి చేయాల్సి ఉంది. ఈ రోడ్డు పనికి రూ.53 కోట్లతో భూసేకరణ చేశారు.
- ఆదోని బైపాస్ రోడ్డు (ఎన్‌హెచ్ 167) పనులు రూ.241.99 కోట్లతో ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీన ప్రారంభమయ్యాయి. ఈ రోడ్డుకు రూ.140 కోట్ల వ్యయంతో భూసేకరణ చేశారు. ప్రస్తుతం మట్టి పనులతో ప్రారంభమైన ఈ రోడ్డు (7.3 కిలోమీటర్ల మేర) 2026 ఫిబ్రవరి 28వ తేది నాటికి పూర్తి చేయాల్సి ఉంది.

ఎఫ్‌డీఆర్ కింద చేపట్టిన పనులు ...



అందంగా రూపుదిద్దుకున్న సోమయాజులపల్లె - డోన్ రోడ్డు

- ఎన్‌హెచ్ 544 డీ పరిధిలోని రామాపురం గ్రామంలో రూ.98.98 లక్షలతో సీసీ రోడ్లు
- తెల్లపురి గ్రామంలో రూ.47.77 లక్షలతో సీసీ రోడ్డు
- ఎన్‌హెచ్ 167కే పరిధిలోని సంగమేశ్వరం నుంచి నొస్సం వరకు కోవెలకుంట్ల గ్రామ సమీపంలో 5 కిలోమీటర్ల మేర రూ.83.93 లక్షలతో బీటీ రోడ్డు
- సంజామల మండలం అక్కంపల్లె గ్రామం రూ.52.33 లక్షలతో బీటీ రోడ్డు
- రూ.15.85 లక్షలతో సంగమేశ్వరం – వెలుగోడు గ్రామాల మధ్య రోడ్డుకు బర్మ్స్

ఓఆర్ కింద చేపట్టిన పనులు ...

ఎన్‌హెచ్ 167కే పరిధిలోని నంద్యాల మండలం రైతునగరం నుంచి గోస్పాడు వరకు రూ.24 లక్షలతో ప్యాచ్ వర్కులు చేపట్టారు. ఇవే కాక, ఆయా జాతీయ రహదారుల పరిధిలోని పలు రోడ్ల నిర్వహణ పనులు చేపట్టారు.

టెండర్ దశలో మంత్రాలయం బైపాస్...

మంత్రాలయం మండలం కల్లుదేవకుంట నుంచి చెట్నేహళ్లి వరకు రూ.49.02 కోట్లతో బైపాస్ రోడ్ (4.50 కిలోమీటర్లు) పనులు చేపట్టనున్నారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో టెండర్లు ఆగిపోయాయి. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ఈ పనులకు టెండర్లను ఆహ్వానించనున్నారు. ఈ బైపాస్ రోడ్ పూర్తి అయితే కర్ణాటకలోని రాయచూర్‌కు వెళ్లేందుకు మార్గం సులభమవుతుంది.

నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు చర్యలు



మూడు జాతీయ రహదారుల నిర్మాణాలను నిర్ణీత సమయంలోగా పూర్తి నాణ్యతతో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. గార్గేయపురం రహదారికి ఉన్న భూసేకరణ సమస్య కూడా తీరింది. ఎన్నికల షెడ్యూల్ అమల్లో ఉన్న కారణంగా మంత్రాలయం బైపాస్ రోడ్డు పనులకు టెండర్లను ఆహ్వానించలేదు. ఆదోని – ఆలూరు బైపాస్ పనులు ఇప్పటికే ప్రారంభం అయ్యాయి. ఆయా రహదారుల్లో అవసరమైన ప్యాచ్ వర్కులు ఎప్పటికప్పుడు చేస్తున్నాం. సోమయాజులపల్లె – డోన్ రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయి.

– డీ శంకర్‌రెడ్డి, ఈఈ, నేషనల్ హైవేస్

క్లుప్తంగా

డయేరియా కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

నంద్యాలటౌన్: ప్రజలు అతిసార వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ మెడికల్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీపీఓ మంజులవాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్‌లతో కలిసి డయేరియా వ్యాధి నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీరు కలుషితం కావడం, తాగునీటిని క్లోరినేట్ చేయకపోవడం, పారిశుద్ధ్య లోపం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామస్తులు క్లోరినేషన్ చేసిన సురక్షితమైన, కాచి చల్లార్చిన నీటిని తాగేలా సలహాలివ్వాలని సూచించారు. పరిసరాల, వ్యక్తిగత శుభ్రత గురించి ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ప్రతివారం ట్యాంకులను శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పైపులైన్లు పగిలి, నీరు కలుషితమయ్యే ప్రమాదముందని, ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఐవోటీలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ)లో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ డిజైన్ మ్యానుఫాక్చరింగ్ డైరెక్టర్ డీవీఎల్ఎన్ సోమయాజులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల్లో నాన్ కంప్యూటర్ బ్రాంచ్‌లో బోధన చేసే అధ్యాపకులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఏఐసీటీఈ వెబ్‌సైట్‌లో వచ్చే నెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, మొదటి విడతలో మొత్తం 50 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రెండో రోజు కొనసాగిన ఉపాధ్యాయుల శిక్షణ



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

గోస్పాడు: స్థానిక మోడల్ స్కూల్‌లో ప్రభుత్వ పాఠశాలల సబ్జెక్టు ఉపాధ్యాయులకు సీబీఎస్ఈ సిలబస్‌పై శనివారం రెండో రోజు శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర కమిషనర్ కార్యాలయ పాఠశాల విద్య పరిశీలకులు శరత్ హాజరై శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు సీబీఎస్ఈ అమలు చేస్తున్నట్లు చెప్పారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను బోధనలో ఉపయోగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ బేగ్, ఎంఈఓ అబ్దుల్‌కరీం పాల్గొన్నారు.



కర్నూలు నగరంలోని శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు



మిడుతూరులో చెస్ ఆడుతున్న విద్యార్థులు

వేసవి శిబిరాలు.. సృజనాత్మకతకు వేదికలు

వేసవిలో విద్యార్థులకు విజ్ఞానాన్ని పంచేందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ నడుంబిగించింది. రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ వేసవి విజ్ఞాన శిబిరాలను గ్రంథాలయాల్లో నిర్వహించేందుకు ఆదేశాలిచ్చింది. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రంథాలయ శాఖల్లో వేసవి సెలవుల్లో విద్యార్థులు పలు అంశాలపై అవగాహన పెంపొందించుకునేందుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. వివిధ పోటీలను నిర్వహిస్తూ పిల్లల మానసికోల్లాసానికి తోడ్పాటునందిస్తున్నారు. ఆట వస్తువులు, కథల పుస్తకాలను అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. విజ్ఞానంతో పాటు వినోదాన్ని అందిస్తుండటంతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటూ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

– కర్నూలు కల్చరల్/ గోస్పాడు

- జిల్లా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు
- వైజ్ఞానిక, సాంస్కృతిక, సృజనాత్మక కళా రంగాలపై ప్రత్యేక శిక్షణ
- ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రంథాలయ శాఖల్లో శిక్షణ శిబిరాల నిర్వహణ
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు

ప్రభుత్వం ఈ వేసవి సెలవుల్లో పిల్లలకు విజ్ఞానంతో కూడిన శిక్షణ అందించేందుకు గ్రంథాలయాలను వేదికగా చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని శాఖా గ్రంథాలయాల్లో గత నెల 29వ తేదీన సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు. జూన్ 7వ తేదీ వరకు కొనసాగనుంది. 40 రోజుల పాటు కొనసాగే క్యాంప్‌లో 5 నుంచి 15 ఏళ్ల లోపు బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అధికారులు కార్యాచరణ అమలు చేస్తున్నారు. పిల్లలకు విజ్ఞానం పెంపొందించేలా, మానసిక వికాసానికి సంబంధించిన ఆటపాటలు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఒక్కో గ్రంథాలయంలో కనీసం 30 మంది నుంచి 60 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సుమారు 100 మంది విద్యార్థులు క్యాంప్‌లో పాల్గొంటున్నారు. అందుకు అనుగుణంగా ప్రతి గ్రంథాలయంలో నిపుణులైన శిక్షకులతో పాటు కార్యక్రమంలో పాల్గొనేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే టీచర్లకు ప్రాధాన్యమిస్తున్నారు. ప్రముఖులు, విశ్రాంత ఉద్యోగులను పిలిపించి వారి అనుభవాలను పిల్లలకు వివరించేలా చర్యలు చేపట్టారు. రచయితలు, డ్రాయింగ్ మాస్టర్లు, క్రాఫ్ట్ టీచర్లు ఇలా పలు రంగాలకు చెందిన వారితో శిక్షణ ఇప్పిస్తున్నారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు బహూకరిస్తున్నారు.

సృజనాత్మక పెంపొందేలా..

జిల్లాలోని గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో సృజనాత్మకత పెంపొందేలా తర్ఫీదు ఇస్తున్నారు. కథలు చెప్పడం, పుస్తక పఠనం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్ వంటి సృజనాత్మక ప్రక్రియలను నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌ల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.



కర్నూలులోని శిబిరంలో నేర్చుకున్న డ్రాయింగ్‌ను వేసి చూపుతున్న విద్యార్థులు



మిడుతూరు గ్రంథాలయంలో క్యారంబోర్డు ఆడుతున్న విద్యార్థులు

సమ్మర్ క్యాంప్ నిర్వహణ ఇలా..

- ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పుస్తక పఠనం
- 10 నుంచి 11 గంటల వరకు కథ, మాట, పాట, పద్యం చెప్పండి కార్యక్రమాలు
- 11 నుంచి 12 గంటల వరకు డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, పెయింటింగ్, సంగీతం, నాట్యం, మ్యాజిక్ నేర్పించడం, వెస్టర్న్ డాన్స్, జానపద నృత్యాలు, లఘు నాటికలు, ఉపన్యాసం ఇవ్వడం ఎలా, స్టేజీ ఫియర్ పోగొట్టే కార్యక్రమాలపై శిక్షణ.

కొత్త అంశాలు తెలుసుకుంటున్నా



గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొంటున్నాను. చిత్రలేఖనం, పుస్తక పఠనం, పేపర్ ఆర్ట్ నేర్పిస్తున్నారు. స్కూల్ ఫ్రెండ్స్‌తో పాటు సమ్మర్ క్యాంప్ ఫ్రెండ్స్ పెరిగారు. సెలవులు వృథా కాకుండా కొత్త అంశాల్లో శిక్షణ ఇవ్వడం సంతోషకరం.

– బిల్విక, 7వ తరగతి విద్యార్థిని

సరదాగా గడిచిపోతోంది



సమ్మర్ క్యాంప్ సరదాగా గడిచిపోతోంది. సెలవుల్లో నిర్వహిస్తున్న క్యాంప్‌కు హాజరు కావడంతో అనేక కొత్త విషయాలు తెలుసుకుంటున్నాం. జాతీయ నాయకుల జీవిత చరిత్రలను కథల రూపంలో చెబుతున్నారు. ఆటపాటలతో ఆనందంగా గడుపుతున్నాం. కొత్త ఫ్రెండ్స్ పరిచయం అయ్యారు.

– హర్షిత్, 6వ తరగతి విద్యార్థి

ఉత్సాహంగా పాల్గొంటున్నారు



ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రంథాలయ శాఖల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. విద్యార్థులు ఉత్సాహంగా క్యాంప్‌లో పాల్గొంటున్నారు. వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇవి ఉపయుక్తంగా నిలుస్తున్నాయి. ప్రత్యేక నిపుణులు పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం క్యాంప్ జరుగుతోంది. అధిక సంఖ్యలో విద్యార్థులు క్యాంప్‌కు వచ్చి సద్వినియోగం చేసుకుంటున్నారు. పిల్లలు తమ ప్రజ్ఞాపాటవాలను పెంపొందించుకునేందుకు ఈ శిబిరాలు ఉపయోగపడుతున్నాయి.

– కె.ప్రకాష్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

కరువు రైతుకు ఉపశమనం

- పూర్తయిన ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల
- ఉమ్మడి జిల్లాకు రూ.460.47 కోట్ల ప్రయోజనం



కర్నూలు(అగ్రికల్చర్): కరువు రైతుకు ఉపశమనం లభించింది. ఇన్‌పుట్ సబ్సిడీ బ్యాంక్ ఖాతాలకు జమ అయ్యింది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.460.47 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చింది. అనావృష్టి పరిస్థితులతో ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో కర్నూలు రూరల్, తుగ్గలి మండలాలు మినహా మిగిలిన 24 మండలాలు, నంద్యాల జిల్లాలో 6 మండలాలను.. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 30 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం గుర్తించింది. మార్చి నెలలోనే ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నప్పటికీ వివిధకారణాల వల్ల నిధులు విడుదల కాలేదు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ఎన్నికల కమిషన్ అనుమతితో రైతుల బ్యాంకు ఖాతాలకు నిధుల విడుదల రంగం సిద్ధం చేసినప్పటికీ టీడీపీ కూటమి అడ్డుకుంది. ఎన్నికల ముగిసిన తర్వాత ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

3,75,244 మంది రైతులకు ప్రయోజనం

కర్నూలు జిల్లాలో వ్యవసాయ పంటలు 2,38,230.92 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. మొత్తం 2,90,741 మంది పంటలను నష్టపోయారు. వీరికి రూ. 371.05 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలైంది. ఉద్యాన పంటలకు సంబంధించి 36,855.25 హెక్టార్లలో టమాట, ఉల్లి, ఎండుమిర్చి, పచ్చిమిర్చి దెబ్బతిన్నాయి. మొత్తం 57,365 మంది రైతులకు రూ.62.65 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలైంది. కర్నూలు జిల్లాలో 3,48,106 మంది రైతులకు రూ.433.70 కోట్ల మేర ఉపశమనం కలిగింది. నంద్యాల జిల్లాలో కరువు ప్రాంతాలుగా గుర్తించిన ఆరు మండలాల్లో 22,812 హెక్టార్లలో 27,138 మంది రైతులు పంటలను 33 శాతం ఆపైన నష్టపోగా... ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.26.87 కోట్లు విడుదలయ్యాయి. ఉమ్మడి జిల్లాలో 3,75,244 మంది రైతులకు రూ.460.47 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ లభించింది.

నియోజక వర్గాల వారీగా ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల వివరాలు

నియోజక వర్గం	లబ్ధిపొందే రైతులు	ఇన్‌పుట్ సబ్సిడీ (రూ.కోట్లలో)
కోడుమూరు	42,210	41.53
పాణ్యం (కల్లూరు, పాణ్యం)	22,476	22.47
మంత్రాలయం	64,523	82.56
ఆదోని	29,864	39.99
ఆలూరు	74,868	113.15
పత్తికొండ	64,314	70.62
ఎమ్మిగనూరు	49,478	63.08
కర్నూలు	373	0.30
మొత్తం	3,48,106	433.70
నంద్యాల జిల్లాలో..		
బేతంచెర్ల	11,999	11.12
బనగానపల్లి	4,888	4.89
గడివేముల	1,030	1.08
మిడుతూరు	5,605	6.10
పగిడ్యాల	3,264	3.23
పాణ్యం	352	0.42
మొత్తం	27,138	26.87

రూ.5 లక్షలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

- సెల్ ఫోన్ హ్యాక్ చేసి డబ్బు డ్రా చేసిన వైనం



బ్యాంక్ వివరాలు చూపుతున్న బాధితుడు షేక్‌ఇబ్రహీం

ఎమ్మిగనూరు రూరల్: సైబర్ మోసాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి ఫోన్ హ్యాక్ చేసి అకౌంట్‌లోని రూ.5 లక్షలను కొట్టేసిన ఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. శనివారం బాధితుడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కోటేకల్ గ్రామానికి చెందిన షేక్‌ఇబ్రహీం పట్టణంలోని గాంధీనగర్ యూనియన్ బ్యాంక్‌లో బిజినెస్ కరస్పాండెంట్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం తన యూనియన్ బ్యాంక్‌లోని అకౌంట్ నంబర్లు 189321150000004, 189321010000009 నుంచి రూ.5 లక్షలు మొబైల్ ఫోన్ హ్యాక్ చేసి నగదును సైబర్ నేరగాళ్లు డ్రా చేసుకున్నారు. తన అకౌంట్ నుంచి నగదు డ్రా అయినట్లు సాయంత్రం మెసేజ్ రావటంతో భయంతో స్థానిక బ్యాంక్ అధికారులకు ఫోన్ చేయగా శనివారం ఉదయం బ్యాంక్‌లో డబ్బు డ్రా అయినట్లు స్టేట్‌మెంట్‌ను తీయించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన పట్టణ సీఐ మధుసూదన్‌రావు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి రాజస్తాన్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అకౌంట్ నెంబర్ 50100433499190కు రూ.1.94 లక్షలు చందుమార్చడి, హర్యానాలోని అనిల్ కుమార్ పేరుతో ఉన్న 10179058918 నెంబర్‌కు రూ.3 లక్షలు జమ అయినట్లు గుర్తించారు. సీఐ మధుసూదన్‌రావు మాట్లాడుతూ స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అధికారులతో మాట్లాడి రాజస్తాన్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఉన్న అకౌంట్ నెంబర్‌తో పాటు రూ.1.94 లక్షలను ఫ్రీజ్ చేయించామని, హర్యానాలోని ఐడీఎఫ్‌బీ ఇక్కడ లేకపోవటంతో బ్రాంచ్ ఎక్కడ ఉందో వివరాలు సేకరించి రూ.3 లక్షలు ఫ్రీజ్ చేయించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సీఐ తెలిపారు. కాగా బాధితుడు షేక్ ఇబ్రహీం సాయంత్రం రాయచూర్‌లోని ఐడీఎఫ్‌బీ బ్యాంక్‌కు వెళ్లి అకౌంట్‌లో చూడగా సైబర్ నేరగాడు నగదు డ్రా చేసుకున్నట్లు విలేకరులకు తెలిపాడు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 11 మంది డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన పరీక్షలకు 90 శాతం హాజరు నమోదైందని వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఉదయం సెషన్‌లో జరిగిన డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షలకు 9,222 మందికి 8,325 మంది, మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన ఆరోసెమిస్టర్‌కు 859 మందికి 792 మంది, స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉదయం సెషన్‌లో 19 మందికి 18 మంది, బీఈడీ మూడో సెమిస్టర్‌కు 3,300 మంది విద్యార్థులకు 306 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. నంద్యాల పీఎస్‌సీ అండ్ కేవీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 4, శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో 2, నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2, సెయింట్ జోసఫ్స్ డిగ్రీ కళాశాల, ఆళ్లగడ్డ ప్రజ్ఞ డిగ్రీ కళాశాల, అనంత డిగ్రీ కళాశాలల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 11 మంది విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.

ఆలూరు ఏడీఈపై వేటు

ఆలూరు రూరల్: విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఆలూరు విద్యుత్ అసిస్టెంట్ డివిజన్ ఇంజినీర్ నాగేంద్ర ప్రసాద్‌పై వేటు పడింది. శనివారం ఆయన్ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. హొలగుంద మండలం కొక్కరచేడ, శ్రీధరహాల్, బేవినహాల్, చాకిబండ గ్రామాల్లో ఎన్నికల ముందు రోజు, ఎన్నికల రోజు మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా పునరుద్ధరించలేదు. హొళగుంద మండలంలో కొన్ని రోజుల క్రితం నిబంధనలకు విరుద్ధంగా ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు, విద్యుత్ స్తంభాల లేన్లు ఏర్పాటు చేశారు. దీనిపై గత నెలలో ఎస్ఈ ఉమాపతి హొళగుందకు వెళ్లి విచారణ చేశారు. అలాగే గతంలో ఇతనిపై అవినీతి ఆరోపణలు ఉండడంతో నాగేంద్రప్రసాద్‌ను సస్పెండ్ చేశారు. హాలహర్వి మండలంలోని పాత విద్యుత్ మీటర్లు స్టోర్‌కు పంపించకుండా ఆలూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణంలోని హాలహర్వి పాత సెక్షన్ ఆఫీసులో ఉంచడంపై 'సాక్షి' గతంలో వెలుగులోకి తీసుకు వచ్చింది.

డిప్లమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సిపెట్) ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్హతతో మూడేళ్ల వ్యవధి డిప్లమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ, ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ బీఎస్సీ విద్యార్హతతో రెండేళ్ల వ్యవధి పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్ ప్లాస్టిక్స్ తీరా స్పెస్పింగ్ అండ్ టెస్టింగ్ కోర్సులకు ఆన్‌లైన్‌లో(https://cipet24onlineregistrationform.org/cipet/లింక్) ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ డైరెక్టర్ సీహెచ్ శేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులకు ఏపీ ప్రభుత్వం నుంచి ఫీజురీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉందన్నారు. జూన్ 9న నిర్వహించే ప్రవేశ పరీక్షలో వచ్చే ర్యాంక్ ఆధారంగా విజయవాడ కేంద్రంలోని 150 సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 6300147965 నంబర్‌ను సంప్రదించాలన్నారు.